
‘‘మీ కథ బావుంది! వెంటనే షూటింగ్‌కి ఏర్పాట్లు చేసుకోండి’’ అన్నారు సుభాష్‌గారు సీతాపతి ఇచ్చిన స్క్రిప్ట్ కాగితాలు అతడికి తిరిగి ఇచ్చేస్తూ.

# డామిట్ కథ అడ్డం తిరిగింది

- డాక్టర్ ఎమ్. సుగుణరావు



సీతాపతికి ఆ మాటలకు ఎగిరి గెంతెయ్యాలని పించింది. అతను ఆపని చెయ్యగలడు. ఎగిరి గెంతెయ్యడం అతడికి వెన్నతో పెట్టిన విద్య. అయినా ఆ ఆనందాన్ని అతికష్టం మీద ఆపుకుని ఆయనకు మరోసారి నమస్కరించి, ఆ రూములోంచి బైటపడ్డాడు.

సీతాపతి మనసు దూదిపింజలా తేలిపోతోంది. తను ఒక ప్రఖ్యాత నటుడితో సినిమా తియబోతున్నాడు' అలా అనుకుంటూ గాల్లో తేలుతూ తన కారు దగ్గరకు చేరుకున్నాడు. ఇంతలో ఫైనాన్సియర్ గోపాలం ఎదురయ్యాడు.

‘‘కాయా, పండా?’’ అన్నాడు.

‘‘బాగా. పండిపోయింది. ఇక తినడమే. ముందు కారెక్కు. కార్లోనే వివరంగా చెపుతాను...’’ అన్నాడు సీతాపతి. ఇద్దరూ కారెక్కారు.

‘‘డ్రైవర్ కారు పోనియ్!’’ అన్నాడు సీతాపతి. కారు కదిలింది.

‘‘కథ గురువుగారికి నచ్చేసింది. ఆయనకు నచ్చే విధంగా రాయించి పట్టుకెళ్ళాను. ఆయనకు రకరకాల వేషాలు వేయడం ఇష్టం. రీలు రీలుకి డ్రెస్సు మారేటట్టు ఉండాలి. అలా రైటరు చేత తయారుచేసిన కథను ఆయన దగ్గరకు పట్టుకెళ్ళాను. ఓకె చేసారు.’’ అన్నాడు సీతాపతి హుషారుగా.

‘‘అంటే?’’ ప్రశ్నించాడు గోపాలం.

‘‘మొదటి సీనులో హీరోగారు పొందూరు ఖద్దరుతో నేసిన

పట్టు పంచె, లాల్చీతో రంగప్రవేశం చేస్తారు. ఆ తర్వాతి నించీ రకరకాలయిన వస్త్రధారణ, ఒక తమిళుడిలా, మళయాళీలా, సిక్కులా ఇలా మనదేశంలోని సంస్కృతిని తెలియచేసే ఇరవైమూడు రకాల డ్రెస్సులు వేసుకుంటారు. క్లయిమాక్స్‌లో ఒక ఖరీదయిన సూటులో కనిపిస్తారు. ఈ బట్టలకే ఇంచుమించు పాతికలక్షలు దాకా అవుతుంది. వీటిని ఏ బట్టల కంపెనీయో స్పాన్సర్ చేస్తారు. వాళ్ళకు మంచి పబ్లిసిటీ.''

చెప్పుకు పోతున్నాడు సీతాపతి.

''బావుంది మీ కాన్సెప్ట్.'' అన్నాడు గోపాలం.

''ఇంకా అయిపోలేదు. ఆయన సినిమాలో వేసుకునే డ్రెస్సుల్ని ఎగ్జిబిషన్ లో పెట్టి ప్రదర్శిస్తాం అలాంటి డ్రెస్సులే చౌకగా కుట్టించి అమ్మకానికి పెడతాం. ఇలా మన సినిమాకు బోలెడంత ప్రచారం.'' అన్నాడు సీతాపతి ఉత్సాహంగా.

''ఇంతకీ మీకు సుభాష్‌గారితో అంత దగ్గర పరిచయం ఎలా కలిగింది?'' అన్నాడు గోపాలం ఆసక్తిగా.

''నేను చిన్నప్పటినించీ ఆయన సినిమాలు విపరీతంగా చూసేవాడిని. సినిమా రిలీజైన వెంటనే మేట్నీ నించి సెకండ్ షో వరకూ అన్నిషోలు చూసేవాడిని. దీంతో స్కూల్‌ఫైనల్ తప్పాను. ఇక బోలెడంత తీరిక. మరీ ఎక్కువగా చూసేసరికి ఆయన హావభావాలు, నడక, మేనరిజాలు అనుకోకుండా అలవాటయిపోయాయి.'' అన్నాడు చెప్పడం ఆపి సిగరెట్ వెలిగించి సీతాపతి.

''ఔను. మీరూ ఆయనలాగే భారీగా వుంటారు. పొడుగు ముక్కు, ఉంగరాల జుత్తు'' అన్నాడు గోపాలం.

''ఔను. ఆయనలా వుండడంతో ఆయన పాడిన హిట్‌పాటలతో స్టెప్పులు వేసేవాడిని ఆయన షూటింగ్ ఎక్కడ జరిగినా వెళ్ళిపోయి ఒక కర్రతో షూటింగ్ చూడడానికి వచ్చిన జనాన్ని దూరంగా తరిమి షూటింగ్ జయప్రదంగా ముగిసేందుకు సాయపడేవాడిని. ఒకసారి ఏం జరిగిందంటే!'' సీతాపతి చెప్పడం ఆపి కళ్ళు మూసుకున్నాడు. ఒక్కసారిగా జరిగిపోయిన ఆ సంఘటన తలుచుకుంటున్న కొద్దీ అతడితో ఒక పులకరింత.

''ఏమయింది?'' అన్నాడు. కళ్ళు మూసుకుని తదాత్మ్యం చెందుతున్న సీతాపతితో గోపాలం. సీతాపతి ట్రాన్స్‌లోంచి బైటకొచ్చి చెప్పడం మొదలుపెట్టాడు.

''ఒకరోజు ఆయన షూటింగ్ మా అమలాపురంలో జరుగుతోంది. హీరోగారు, విలన్‌ని తరుముకుంటూ మేడమీద నించి దూకే సీను. డైరెక్టరు స్టార్ట్, కెమెరా అన్నారు. హీరోగారు దూకబోయేసరికి ఆయన మెడ దగ్గర నరం బెణికింది. అంతే. ఆగిపోయారు.'' చెప్పడం ఆపి మళ్ళీ సిగరెట్ వెలిగించాడు సీతాపతి.

''ఆ తర్వాత ?'' అన్నాడు గోపాలం సస్పెన్స్ తట్టుకోలేక.

''అప్పుడు వెంటనే నా జేబులోని జండుబామ్ తీసి హీరోగారి మెడమీద రుద్దాను. ఆయనకు ఉపశమనం కలిగింది. అంతవరకు క్లోజప్‌లో నా ముఖం చూడని ఆయన, ''ఈ వ్యక్తి అచ్చం నాలానే వున్నాడు. ఇతడినే నా డూప్‌గా పెట్టి ఈ గోడమీద నించి దూకే సీను లాగిస్తే సరి.'' అనుకున్నాడు.

''మైగాడ్!'' అన్నాడు ఆశ్చర్యంగా గోపాలం సీతాపతి మాటలకు అడ్డొస్తూ.


అలా ఆయన మనసులోని మాట పైకి అనిన ఉత్తర క్షణంలో నేను ఆయన డూప్‌గా మేడమీద నించి దూకేసాను. సీను ఒకే అయ్యింది. హీరోగారు సంతోషించారు.'' అన్నాడు సీతాపతి.

రన్నమాట! అన్నాడు.

''ఔనయ్యా, ఆయనకు డూప్‌గా ఎన్నో సినిమాల్లో దెబ్బలు తిన్నాను. శరీరంలో చాలా స్టీలు రాడ్లు. అయితే ఏం ఆయన అభిమానం పొంది చివరికి ఆయనతో సినిమా తీసే దశకు ఎదిగాను.'' అన్నాడు సీతాపతి గర్వంగా.

''చాలా సంతోషం. మీరు సుభాష్‌గారితో తియ్యబోయే సినిమాకు నాది యాభై శాతం ఫైనాన్స్...మీరు కబురు చేసిన వెంటనే వాలిపోతాను. నన్ను ఇక్కడ దింపెయ్యండి.'' అంటూ గోపాలం కారు ఆగగానే సీతాపతికి నమస్కారం చేసి ముందుకు వెళ్ళిపోయాడు.

సీతాపతితో కారు ముందు సాగిపోయింది.




''శభాష్..మీరు చాలా గొప్పవారు.'' అన్నాడు గోపాలం. చేత్తో సీతాపతి తొడ చరిచి, అంతలోనే కెవ్వుమని కేకవేసి, '' ఏమిటీ మీ తొడ ఇనుపరాడ్‌లా గట్టిగా వుంది. నా చెయ్యికి ఏమిటో ఇంత భయంకరమైన నొప్పి..'' అంటూ తన చెయ్యివంక ఆశ్చర్యంగా చూసుకున్నాడు గోపాలం.

''ఎందుకు అంత ఆశ్చర్యపోతున్నావ్ ఇనుపముక్కని చేత్తో గట్టిగా కొడితే నొప్పి ఎవరికి? చేతికా ఇనుపముక్కకా!'' అన్నాడు సీతాపతి తాపీగా.

''అంటే మీతొడ ఇనుపముక్కా!'' అన్నాడు ఆశ్చర్యంలోంచి ఇంకా తేరుకోని గోపాలం.

''ఔను నాయనా. ఆరోజు హీరోగారి డూప్‌గా మేడమీదనించి దూకిన ఫలితంగా నా తొడ ఎముక విరిగింది. ఆస్పత్రిలో స్టీలురాడ్డు వేసారు. మీ చేతికి దెబ్బ తగలడం వెనక కథ అది.'' అన్నాడు సీతాపతి వివరంగా.


సీతాపతి మాటలకు గోపాలం మరింత ఆశ్చర్యానికి లోనయి, ''యు ఆర్ రియల్లీ గ్రేట్ సుభాష్ గారితో మీరు ఈ విధంగా సన్నిహితులయ్యా

***

రెండు నెలల తర్వాత సినిమాలో హీరో సుభాష్‌గారు ధరించే ఇరవైనాలుగు డ్రెస్సులు తయారవడంతో సీతాపతి షూటింగ్ మొదలుపెట్టాడు.

మొదటిరోజు షూటింగ్ తెలుగువాడి గెటప్పు. పట్టు పంచె, లాల్చీతో హీరోగారి సీను మొదలయ్యింది. అరగంటలో ఆ సీను పూర్తయ్యింది. అదే డ్రెస్సుతో ఆయన తరువాత సినిమా షూటింగ్‌కు బయలుదేరారు. పట్టుపంచె, లాల్చీ విప్పి తను వేసుకొచ్చిన టీషర్టు, జీన్సుతో వెళ్ళిపోతారని ఊహించిన సీతాపతికి చుక్కెదురయ్యింది. ఆయన సినిమాలో వాడిన గెటప్‌తోనే కారెక్కేసారు. మనసులో దుఃఖిస్తూ అలా చూస్తూ ఉండిపోయాడు సీతాపతి.

అయితే ఆ దృశ్యం మరలా పునరావృతం అయ్యింది. తరువాతి రోజు వేసుకున్న తమిళుడి గెటప్..వారం తర్వాత కాశ్మీరీ వేషం, ఇంకా పంజాబీలు ధరించే తలపాగా, బట్టలు ఇలా సీతాపతి లక్షలు ఖర్చుపెట్టి ఏదో బట్టల కంపెనీ సొజ




న్యంతోనో కుట్టించిన డ్రెస్సులన్నీ హీరోగారితో పాటూ ఆయన ఇంటికి వెళ్ళిపోయాయి..

ఒకరోజు హీరోగారికోసం ఆయన ఇంటికి వెళ్ళిన సీతాపతి రహస్యంగా ఆయన డ్రెస్సింగ్ రూము చూసాడు. అక్కడ సినిమాకోసం వాడిన ఇరవైమూడు డ్రెస్సులు వెక్కిరిస్తూ కనిపించాయి. అప్పుడు సీతాపతికి అర్థం అయింది. ఆయన ఉపయోగించే సినిమా బట్టలు ఏవీ తిరిగి నిర్మాతలకు చేరవు అని. అంతే! అలా దుఃఖపడుతూ ఇంట్లో కూర్చున్నాడు సీతాపతి. ఆఖరి సీను షూటింగ్ గురించి చర్చించడానికి డైరెక్టరు, రైటరు సీతాపతి ఇంటికొచ్చారు.

"ఏంటి సార్ షూటింగ్ అయిపోయే దశలో ఆనందంగా వుండకుండా అలా ఆందోళనగా ఉన్నారే!" అన్నాడు రైటరు సీతాపతి వాలకం చూసి.

"ఏం చెప్పమంటారు. హీరోగారు మన సినిమాలో వేసుకున్న డ్రెస్సుల్ని ప్రదర్శించి వేలం వేయిద్దామనుకున్నాను. అలాంటి డ్రెస్సులే కుట్టించి అమ్మకానికి పెడదామనుకున్నాం... ఇపుడు ఆ డ్రెస్సులేవీ మనకు మిగల్లేదు. ఇక ఆఖరి సీనులో ఆయన వేసుకునే సూటు, అతి ఖరీదయింది. దానికోసం ఎంత ఖర్చుపెట్టామో మీకు తెలియంది కాదు. అది మిగిలినా చాలు అనే ఆశతో ఉన్నాను. ఆ ఆశా అడియాశ అయ్యేలా వుంది." అన్నాడు సీతాపతి దిగులుగా.

సీతాపతి మాటలకు డైరెక్టరు, రైటరు ఆలోచనలో పడ్డారు. ఐదు నిమిషాల తర్వాత "యురేకా!" అంటూ రైటరు అరిచాడు.

"ఏమిటీ?" అన్నాడు సీతాపతి.

"మీరు తయారుచేయించిన ఆ అతిఖరీదైన సూటు మీకు దక్కాలంటే ఒక మంచి సలహా ఇస్తాను." అన్నాడు రైటరు.

"చెప్పండి!" అన్నాడు సీతాపతి ఆశగా.

"గోడలకు చెవులు కాదు సెల్‌ఫోను లుంటాయి. అలా బైటకెళ్ళి మాట్లాడుకుందాం." అంటూ రైటరు బయటకు నడిచాడు. సీతాపతి, డైరెక్టరు అతడిని అనుసరించారు.

రైటరు తన మనసులోని మాటను బైటపెట్టాడు. సీతాపతి ముఖం వెలిగిపోయింది. "మై గాడ్, చాలా అద్భుతమైన ఐడియా. నా సూటు నాకు దక్కుతుంది." అన్నాడు సీతాపతి ఆనందంగా.

***

తరువాతి రోజు సీతాపతి, డైరెక్టరు, రైటరు, హీరో గారి ఇంటికి వెళ్ళారు. ఆయన షూటింగ్‌కు రావడానికి తయారవుతున్నారు.

"సార్. మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడదామని వచ్చాం." అన్నాడు సీతాపతి.

"ఏంటీ విషయం?" అన్నారు ఆయన. రైటరు వెంటనే "సార్ మేం ముగ్గురం ఆలోచించి ఒక సీన్ తయారు చేసాం. దాంతో సినిమా ముగిస్తే మీకు అవార్డు రావడం ఖాయం!" అన్నాడు.

"ఏమిటా సీను!" అన్నాడు ఆయన ఆసక్తిగా.

"మీరు ఇంతవరకూ వివిధ రాష్ట్రాల డ్రెస్సులు వేసుకున్నారు. ఆఖరుగా ఖరీదైన సూటుతో కనిపిస్తారు. ఆ సూటు తర్వాత ఒక యోగిపుంగవుడిలా వస్త్రాలు ధరించి ప్రేక్షకులకు ఒక సందేశం ఇస్తే మీకు అవార్డు రావడం ఖాయం." అన్నాడు డైరెక్టరు.

"ఏ యోగి వేషం" అన్నారు హీరోగారు అనుమానంగా. అందరివంకా చూస్తూ.

"యోగి వేమన వేషం సార్. నేపథ్యంలో పుట్టినప్పుడు బట్ట కట్టలేదు. పోయేటపుడు అది వెంట రాదు...అనే పాట వస్తుంది. మీరు రకరకాలయిన డ్రెస్సులు వేసుకుని క్లయిమాక్సులో సర్వసంగ పరిత్యాగి అయిన యోగివేమనలా కనిపిస్తే ప్రేక్షకులు మీకు బ్రహ్మరథం పడతారు." అన్నాడు రైటరు ఉద్రేకంగా.

హీరోగారు క్షణంసేపు ఆలోచనలో పడ్డారు. ఆ గదిలో నిశ్శబ్దం. ఆయన వంకే చూస్తూ టెన్షన్ అభ విస్తున్నాడు సీతాపతి..

ఐదునిముషాల తర్వాత..."బావుంది అలాగే కానిద్దాం." అంటూ హీరోగారు లేచారు. 'అమ్మయ్య' అనుకుంటూ సీతాపతి ఊపిరి పీల్చుకున్నాడు.

***

రెండురోజుల తర్వాత ఆఖరి సీనుల షూటింగ్. సీతాపతి రెండు బ్రీఫ్‌కేసులతో తయారుగా వున్నాడు. ఒకదాంట్లో సీను కోసం వేసుకునే సూటు, రెండో దాంట్లో ఆఖరిసీనులో ఆయన ధరించే యోగివేమన డ్రెస్సు వున్నాయి.

"హీరోగారు రాగానే "సార్ ముందుగా సూటు వేసుకోండి" అంటూ బ్రీఫ్‌కేస్ అందించాడు. సీతాపతి. ఆయన డ్రెస్సింగ్ రూములోకి వెళ్ళి పావుగంటలో బైటకొచ్చారు. ఆ సూటులో ఆయన మెరిసిపోతున్నారు. ఆ సూటును చేసిన సీతాపతి మురిసిపోతున్నాడు.

అరగంటలో ఆ సీను పూర్తయ్యింది. రెండో బ్రీఫ్‌కేసు ఆయనకు ఇచ్చి, "సార్ దీంట్లో యోగివేమన

డ్రెస్సుంది..అంటే అంగవస్త్రం దీన్ని వేసుకుని వస్తే క్లైమాక్స్ పూర్తిచేద్దాం." అన్నాడు సీతాపతి.

ఆయన సీతాపతి వంక చూసి "నువ్ నా డూప్‌గా చాలా సినిమాల్లో వేసావ్. పాపం వాటిల్లో నీకు చాలా దెబ్బలు తగిలాయి. ఈ ఆఖరి సీనులో యోగి వేమన వేషం నువ్వే వేసెయ్యి. నీకు ఈ సీనులో ఏ రిస్కూలేదు. లాంగ్ షాట్‌లో తియ్యండి ఫరవాలేదు." అలా చెపుతూ ఆయన తను వేసుకున్న సూటుతోనే కారెక్కేసారు.

సీతాపతికి ఆయన మాటలు పూర్తిగా అర్థమయ్యేసరికి దుఃఖం సముద్రంలా పొంగుకుంటూ వచ్చింది.

"ఆయన ఈ సీనులో నాకు దెబ్బలు తగలవంటున్నారు. ఆ దెబ్బలకన్నా మించిన పెద్ద దెబ్బే తగిలింది." మనసులోని అతడిమాటలు పైకి వచ్చేసాయి.

డైరెక్టరు, రైటరు అతడివంక జాలిగా చూసారు. సీను కట్ చేస్తే సీతాపతి అంగవస్త్రం వేసుకుని హీరోగారి డూప్‌గా యోగివేమన వేషంలో ప్రత్యక్షమయ్యాడు.

"పాపం సీతాపతి గారికి మంచి వేషమ్ దొరికింది. రేపు సినిమా పోయినా ఆయన ఈ యోగివేమన వేషంతో బ్రతికెయ్యవచ్చు." ఎవరో జోకేసారు. ఆ మాటలకు మరింత బాధపడిన సీతాపతి "డామిట్! కథ అడ్డం తిరిగింది." అన్నాడు గట్టిగా

"ఈ డైలాగు స్క్రిప్టులో లేదు. కట్!" అన్నాడు డైరెక్టరు.

★